క్లుప్తంగా

బాధిత కుటుంబానికి సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు : జిల్లా పోలీసు శాఖలో 2011 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్ ఎస్.అన్సర్ బాషా సెబ్ చెక్‌పోస్టులో విధులు నిర్వహిస్తూ మే 11వ తేదీ రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు ఒకటో పట్టణ పోలీసులు తమ వంతు సహాయంగా సేకరించిన రూ.1.53 లక్షల నగదును జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ కృష్ణకాంత్ చేతుల మీదుగా అన్సర్ బాషా తండ్రి ఖాశీం వలికి అందజేశారు. కర్నూలు డీఎస్పీ కె.విజయశేఖర్, ఒకటవ పట్టణ సీఐ తిమ్మారెడ్డి, ఏఎస్ఐ నర్సింహులు, హెడ్ కానిస్టేబుల్ సత్తార్, కానిస్టేబుళ్లు మల్లికార్జున, బాషా, జమీర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఏపీపీగా ఖాదర్ బాషా

కర్నూలు (లీగల్): కర్నూలు అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు ఏపీపీగా కె.ఖాదర్ బాషా నియమితులయ్యారు. గడచిన మూడు నెలల క్రితం వరకు ఏపీపీగా పనిచేసిన బాలు నాయక్ మృతిచెందడంతో అప్పటి నుండి సుబ్బయ్య పీపీగా వ్యవహరిస్తున్నారు. కడప టౌన్ సీనియర్ ఏపీపీగా పనిచేస్తున్న ఖాదర్ బాషాను సాధారణ బదిలీల్లో భాగంగా కర్నూలుకు బదిలీ చేశారు. అలాగే కర్నూలు ఎక్సైజ్ కోర్టు ఏపీపీగా పనిచేస్తున్న పద్మజను డోన్ కోర్టుకు, అక్కడ పనిచేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డిని కర్నూలు ఎక్సైజ్ కోర్టుకు బదిలీ చేశారు. అనంతపురం జిల్లా మడకశిరలో పనిచేస్తున్న జి.ప్రేమలతను ఆదోని కోర్టుకు, అనంతపురం ట్రెనింగ్ కళాశాలలో పనిచేస్తున్న ఎ.శ్రీనివాసులును నంద్యాల కోర్టుకు, కోవెలకుంట్లలో పనిచేస్తున్న వెంకటేశ్వర్లును పత్తికొండకు బదిలీ చేశారు. వీరందరూ సోమవారం విధుల్లో చేరారు.

సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు సిటీ: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ఫ్యాప్టో కమిటీ పిలుపు మేరకు 8 అంచెలుగా ఉద్యమాలను చేపట్టనున్నట్లు జిల్లా కమిటీ ప్రకటించింది. సోమవారం స్థానిక సలాంఖాన్ భవనంలో ఫ్యాప్టో జిల్లా కమిటీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కో-చైర్మన్, ఆప్టా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రావు, ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఓంకార్ యాదవ్, జిల్లా కమిటీ చైర్మన్ ఎస్.గోకారి, సెక్రటరీ జనరల్ గట్టు తిమ్మప్పలు పాల్గొని ప్రసంగించారు. అనంతరం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై స్పందనలో జేసీ ఎస్.మౌర్యకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీని అరెస్టు చేయాలి



ధర్నా నిర్వహిస్తున్న ఐద్వా మహిళలు

కర్నూలు(సెంట్రల్) : మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషన్ సింగ్‌పై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఐద్వా రాష్ట్ర నాయకురాలు పి.నిర్మల, జిల్లా కార్యదర్శి ఎన్.అలివేలు డిమాండ్ చేశారు. సోమవారం ఐద్వా ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ధనలక్ష్మి, పద్మా, రషీదా పాల్గొన్నారు.

తెరుచుకున్న రైతు సంజీవిని

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో దాదాపు రెండేళ్లుగా మూతపడిన రైతు సంజీవిని ఆసుపత్రి తెరుచుకుంది. మార్కెట్ కమిటీ గౌరవ చైర్మన్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, పాలకవర్గం చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో ఆసుపత్రికి సివిల్ సర్జన్‌గా డాక్టర్ రంగతులసమ్మను నియమిస్తూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం సాయంత్రం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రైతు సంజీవని ఆసుపత్రి పనిచేస్తుందని తెలిపారు. రైతులు, కార్మికులు, వ్యాపారులు ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఉన్నా వైద్యం చేయించుకోవచ్చని సెక్రటరీ గోవిందు ఒక ప్రకటనలో తెలిపారు.

స్పందన సమస్యల పరిష్కారానికి చర్యలు



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న మున్సిపల్ అధికారులు

కర్నూలు (టౌన్): నగరంలోని వివిధ కాలనీల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక ఎస్ఈ వేణుగోపాల్ అన్నారు. సోమవారం స్థానిక నగరపాలక కార్యాలయం కౌన్సిల్ హాలులో స్పందన కార్యక్రమం జరిగింది. అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రంగస్వామి, హయత్ మోదీన్, మేనేజర్ చిన్నరాముడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణకు మోక్షం !

- నగరంలోని ముఖ్యకూడళ్లలో రహదారుల విస్తరణకు చర్యలు
- ఇప్పటికే పూర్తయిన సర్వే పనులు
- కిడ్స్ వరల్డ్ నుంచి బళ్లారి చౌరస్తా, గాయత్రీ ఎస్టేట్ నుంచి నంద్యాల చెక్‌పోస్టు వరకు
- రహదారుల విస్తరణతో తీరనున్న ట్రాఫిక్ సమస్య



రాజ్ విహార్ సర్కిల్



సి.క్యాంపు నుంచి నంద్యాల చెక్‌పోస్టు వరకు విస్తరించనున్న రోడ్డు

కర్నూలు (టౌన్): గత పదేళ్లలో పెరిగిన జనాభాకు తోడు శివారులోని 6 గ్రామ పంచాయతీలు నగరంలో విలీనమయ్యాయి. దీంతో నిత్యం వాహనాల రాకపోకలతో నగర రోడ్లు రద్దీగా మారాయి. ముఖ్య కూడళ్లలో తరచుగా ట్రాఫిక్ జాం అవుతోంది. ఈ సమస్య పరిష్కారానికి నగరపాలక అధికారులు ప్రధాన రహదారుల విస్తరణకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే అందుకు అవసరమైన సర్వే సైతం పూర్తి చేశారు. మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా రోడ్లను 120 అడుగుల మేర విస్తరించాలని నిర్ణయించారు. ఇందుకు కౌన్సిల్ సైతం ఆమోదం తెలిపింది.త్వరగా పనులు ప్రారంభించాలని రోడ్డు సేఫ్టీ కమిటీ చైర్మన్ అయిన జిల్లా కలెక్టర్ సృజన ఇటీవల ఆదేశాలు జారీ చేయడంతో నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్ తయారీలో నిమగ్నమయ్యారు.

విస్తరణ ఎక్కడెక్కడంటే...

నగరంలోని కిడ్స్ వరల్డ్ నుంచి బళ్లారిచౌరస్తా వరకు 2.6 కి.మీ. పొడవు ఉంది. ప్రస్తుతం ఇక్కడ 80 అడుగుల నుంచి 100 అడుగుల వరకు రోడ్డు ఉంది. పెరిగిన వాహనాలతో ఈ మార్గంలో తరచుగా ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. కిడ్స్ వరల్డ్ నుంచి రాజ్ విహార్ వరకు పలు చోట్ల విస్తరణ చేయాల్సి ఉంది. అలాగే కొత్త బస్టాండ్ సమీపంలోని సుందరయ్య సర్కిల్ వద్ద ఒక లాడ్జి వద్ద విస్తరణ పనులు చేయాల్సి ఉంది. గతంలో కొంత మేర చేసిన మధ్యలో పనులు నిలిపి వేశారు. అలాగే విద్యుత్ శాఖ కార్యాలయం, ఏపీఎస్పీ క్యాంపు ప్రాంతాల్లో నిత్యం ట్రాఫిక్ సమస్యతో వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద 20 నిమిషాల వరకు ఆగాల్సి ఉంటుంది. ఈ సమస్యకు పరిష్కారంగా రోడ్డును 120 అడుగులకు విస్తరించనున్నారు. నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ వద్ద విస్తరణ పనులు చేశారు. అయితే, ఎదురుగా ఉన్న రహదారిలో పనులు చేపట్టలేదు. బళ్లారి చౌరస్తా నుంచి ఉల్చాల రోడ్డు వరకు విస్తరణ పనులు చేపట్టాల్సి ఉంది. ఆయా ప్రాంతాల్లో ఈ పనులు చేపడితే ట్రాఫిక్ సమస్య కొంత మేర తగ్గుతుందని టౌన్ ప్లానింగ్ అధికారులు చెబుతున్నారు.

- అలాగే గాయత్రీ ఎస్టేట్ నుంచి నంద్యాల చెక్ పోస్టు వరకు రహదారి విస్తరణ పనులు చేపట్టనున్నారు. దాదాపు 2 కి.మీ పొడవు గల ఈ మార్గంలో పలుచోట్ల 60 అడుగుల నుంచి 100 అడుగుల లోపు రోడ్డు ఉంది. గాయత్రీ ఎస్టేట్ ప్రాంతంలో ప్రతి రోజు విపరీతంగా రద్దీ ఉంటుంది. సర్కిల్ ఉండటం, అక్కడే బస్టాప్‌లు, ఆటోలు నిలిపేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య అధికం. ఇక్కడ రోడ్డును విస్తరించాలని నగర పాలక అధికారులు నిర్ణయించారు. అలాగే సి.క్యాంపు నుంచి మద్దూర్ నగర్ ప్రాంతాల్లో విస్తరణ పనులు చేయాల్సి ఉంది. ఇక్కడ గతంలో అధికారులు కొంత మేర పనులు చేపట్టి వదిలిపెట్టారు. వాణిజ్య ప్రాంతం కావడంతో పూర్తి స్థాయిలో విస్తరణ చేయలేదు. ఇప్పుడు ఈ ప్రాంతంలో మాస్టర్ ప్లాన్ ప్రకారం 120 అడుగుల విస్తరణకు గ్రీన్ సిగ్నల్ లభించింది.
- బిర్లాగేట్ సర్కిల్ ప్రాంతంలో కూడా వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీంతో ఇక్కడ సైతం విస్తరణ పనులు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. తొలుత రహదారులు, భవనాల శాఖ, ప్రజారోగ్య సాంకేతిక శాఖ కార్యాలయం నుంచి విస్తరించే పనులు చేపట్టనున్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో మార్కింగ్ పనులు కూడా పూర్తయ్యాయి. బిర్లాగేట్ సమీపంలోని తాత్కాలిక షాపులకు నోటీసులు జారీ చేశారు. బిర్లా గేట్ నుంచి సంక్షేమ భవన్ వరకు ఉన్న షాపులను తొలగించనున్నారు. బిర్లా గేట్ నుంచి బి.క్యాంపు పోస్టాఫీస్ మీదుగా సి.క్యాంపు వరకు రహదారులను విస్తరించనున్నారు. ఈ పనుల వల్ల ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ సమస్య తీరుతుంది.



సర్వే చేస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

సర్వే పనులు పూర్తి

నగరంలో ముఖ్యమైన చోట్ల రహదారులను విస్తరించేందుకు సర్వే చేశాం. కొన్ని చోట్ల ఇందుకు సంబంధించిన పనులు కూడా పూర్తి చేశాం. ప్రస్తుతం ప్రధాన కూడళ్ల ఉన్న ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీంతో వాహనదారులు, నగర ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కిడ్స్ వరల్డ్ నుంచి రాజ్‌విహార్ అక్కడి నుంచి కొత్తబస్టాండ్ మీదుగా బళ్లారి చౌరస్తా వరకు, అలాగే సి.క్యాంపు నుంచి గాయత్రీ ఎస్టేట్, నంద్యాల చెక్‌పోస్టు వరకు విస్తరించే పనులు చేపడుతున్నాం. – మోహన్ కుమార్, ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్

ఈ రోజు

కల్లూరు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): కల్లూరు చెన్నమ్మ సర్కిల్ వద్ద జరుగుతున్న మరమ్మత్తు పనులు కారణంగా మంగళవారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు ఇండస్ట్రీయల్ ఎస్టేట్ ఏఈ నాగప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయ్యప్ప స్వామి నగర్, చింతలముని నగర్, పంచరత్న కాలనీ, చెన్నమ్మ సర్కిల్, సుంకులమ్మ గుడి తదితర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైద్య సేవలు

చిన్నారికి అరుదైన శస్త్రచికిత్స

కర్నూలు(హాస్పిటల్): మూడేళ్ల బాలుడికి కర్నూలులోని మెడికవర్ హాస్పిటల్ వైద్యులు అరుదైన శస్త్రచికిత్స ద్వారా ప్రాణాలు కాపాడారు. వివరాలను సోమవారం మెడికవర్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో న్యూరోసర్జర్ డాక్టర్ వరుణ్‌కుమార్, పీడియాట్రిక్ ఇంటెన్సివిస్ట్ డాక్టర్ మురళీ, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ మంజునాథ్ వివరించారు. 'నంద్యాల జిల్లా అవుకు మండలం మెట్టుపల్లి గ్రామానికి చెందిన మూడేళ్ల మణిదీప్‌కు గత నెలలో బైక్ ఆక్సిడెంట్‌లో తీవ్రమైన గాయం కావడంతో తల్లిదండ్రులు బాలుడిని మెడికవర్ హాస్పిటల్‌కు తీసుకువచ్చారు. బాబు తలకు, పొట్ట భాగంలో తీవ్రమైన గాయాలతో పలు ఎముకలు విరిగాయి. బాబు తలలో తీవ్రమైన వాపు ఉండటంతో పుర్రె ఎముకను తొలగించి శస్త్రచికిత్స చేశాం. దీంతో బాబు నెమ్మదిగా కోలుకోవడంతో 20 రోజుల తర్వాత ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశా'మని వెల్లడించారు. సమావేశంలో హాస్పిటల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ మహేశ్వరరెడ్డి, సెంటర్ హెడ్ నీలారెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం







నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు,పర్యావరణ ప్రేమికులు, ప్రతిజ్ఞ చేస్తున్న మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, మొక్క నాటుతున్న అదనపు సీనియర్ సివిల్ జడ్జి పి.దివాకర్

కర్నూలు(హాస్పిటల్): కలిసికట్టుగా పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని వక్తలు పిలుపునిచ్చారు. సోమవారం నగరంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలువురు పర్యావరణంపై అవగాహన ర్యాలీలు, మొక్కల పెంపకం తదితర కార్యక్రమాలు చేపట్టారు.

- కర్నూలు మెడికల్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పి. సుధాకర్ మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు పాటుపడతామని పేర్కొంటూ వైద్యులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేశారు. ఎన్ఎస్ఎస్ కళాశాల కో ఆర్డినేటర్ విజయభాస్కర్‌రెడ్డి, కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌ఓడీ సుధాకుమారి, ప్రొఫెసర్ డాక్టర్ సింధియా శుభప్రద, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వాల్మీకి శ్రీనివాస్, డాక్టర్ రేణుక, డాక్టర్ క్రిష్ణకుమారి పాల్గొన్నారు.
- కర్నూలు (న్యూసిటీ): పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య బాయినేని శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఆ వర్సిటీ ఆవరణలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జేఎండీ షఫీ, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ వెంకటప్ప పాల్గొన్నారు.
- కర్నూలు కల్చరల్: పర్యావరణ రహిత జీవన శైలిని అలవర్చుకోవాలని జిల్లా అటవీ శాఖ అధికారి పి.శివశంకర్‌రెడ్డి, సంయుక్త ప్రధాన పర్యావరణ ఇంజినీర్ డాక్టర్ కేవీ రావు, కర్నూలు నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వరరావు, కాలుష్య నియంత్రణ మండలి అధికారి మునిప్రసాద్ అన్నారు. మిషన్ లైఫ్‌లో భాగంగా పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనంలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అంతకు ముందు వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ బ్యాగ్‌లకు బదులు గుడ్డ, నార సంచులను ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి రమణారెడ్డి, అటవీ శాఖ కర్నూలు రేంజర్ సూర్య చంద్రరాజు, ఏపీపీసీబీ అనలిస్ట్ గణేష్ కుమార్, ఈఈ షాకీర్, మున్సిపల్ కార్పొరేషన్ డీఈ రాజశేఖర్, ఎస్ఈఈ బుచ్చిబాబు, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు విశ్వేశ్వరరెడ్డి, సుజాత, విశ్రాంత అటవీ శాఖ అధికారి జయచంద్రా రెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.
- కర్నూలు (లీగల్): పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయ ఆవరణలో సిబ్బందితో కలిసి అదనపు సీనియర్ సివిల్ జడ్జి పి.దివాకర్ మొక్కలు నాటారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మిషన్‌లైఫ్ వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న జేసీ

కర్నూలు(సెంట్రల్): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జాయింట్ కలెక్టర్ ఎన్.మౌర్య అన్నారు. సోమవారం ఆమె కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన మిషన్ లైఫ్ పోస్టర్లను డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావుతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ కోసం జీవన శైలి ప్రతిజ్ఞను డీపీఓ నాగరాజునాయుడు అందరితో చేయించారు. కార్యక్రమంలో డీఎస్ఓ శివశంకర్‌రెడ్డి, డీఎంహెచ్ఓ రామగిడ్డయ్య పాల్గొన్నారు.

- కర్నూలు (టౌన్) : కోటక్ మహీంద్రా బ్యాంకు స్థానిక నగరపాలక సంస్థ ప్రాంగణంలో కాటన్ బ్యాగులను పంపిణీ చేసింది. కార్యక్రమంలో బ్యాంకు ఏరియా మేనేజర్ ప్రశాంత్‌కుమార్, సంస్థ బ్రాంచ్ మేనేజర్ లాల్ బహదూర్ షా పాల్గొన్నారు.
- కర్నూలు సిటీ: కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీలో యువజన సర్వీస్ శాఖ, ఎన్‌సీసీ విభాగాల ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు వక్తృత్వ, పోస్టర్ మేకింగ్ పోటీలు నిర్వహించి ప్రతిభావంతులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం సెట్కూరు సీఈఓ పి.వి, రమణ, కాలేజీ ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి మాట్లాడారు. ఫస్ట్ స్టెప్ సొసైటీ డైరెక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.
- మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీలో డైరెక్టర్ డా.ఆదిమూలపు సతీష్, శంకరాస్ డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మొక్కలు నాటి మాట్లాడారు.

కర్నూలు కల్చరల్: పర్యావరణ పరిరక్షణకు పచ్చదనం పెంచాలని పర్యావరణ వేత్త, జేపీవీ జాతీయ నాయకులు యాగంటీశ్వరప్ప అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క, జేవీవీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు దామోదర్‌రావు, గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వజ్రాల గోవిందరెడ్డి, ఎస్.బాష పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న జి.నాగేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): ఏసీసీ సిమెంట్ ఆధ్వర్యంలో సోమవారం నిర్మాణాల్లో ఉన్న గృహాల వద్ద మొక్కలు నాటారు. ఆ సంస్థ ఏపీ స్టేట్ ఇన్‌చార్జ్ జి.నాగేశ్వరరావు మాట్లాడుతూ..మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ రాధాకృష్ణ, టెక్నికల్ ఆఫీసర్ ఉమాకాంత్ పాల్గొన్నారు.

- కర్నూలు(అగ్రికల్చర్): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తోందని పరిపాలన కార్యాలయం డిప్యూటీ జనరల్ మేనేజర్ లేఖామీనస్ పేర్కొన్నారు. ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచీ నుంచి నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఏజీఎంలు, చీఫ్ మేనేజర్‌లు, మేనేజర్‌లు పాల్గొన్నారు.
- కర్నూలు మలబార్ గోల్డ్ సంస్థ మొక్కలను పంపిణీ చేసింది. స్టోర్ హెడ్ ఫయాజ్, మార్కెటింగ్ మేనేజర్ నూరుల్లా, మలబార్ గోల్డ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్

టెన్నిస్ టోర్నమెంట్‌లో ప్రతిభ

కర్నూలు(రూరల్): రాయలసీమ స్థాయి టెన్నిస్ పోటీల్లో మైపర్ అకాడమీకి చెందిన క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరచి పతకాలను కైవసం చేసుకున్నారు. ఆదివారం అనంతపురం నారాయణ అకాడమీలో జరిగిన పోటీల్లో అండర్-10 విభాగంలో కర్నూలుకు చెందిన ఎం.రామ్‌ధీరజ్ అనంతపురానికి చెందిన ఆద్విక్‌పై (6-2) తేడాతో గెలిచి విన్నర్‌గా నిలిచాడు. అండర్-16లో కర్నూలుకు చెందిన సాయిశంకర్, మహిళల సింగిల్స్‌లో కర్నూలుకు చెందిన అర్షియా రన్నర్స్‌గా నిలిచారు. మహిళల డబుల్స్‌లో అర్షియా, జాస్మిన్ రెండో స్థానంలో నిలిచారు. పతకాలు సాధించిన క్రీడాకారులను మైపర్ అకాడమీ యాజమాన్యం అభినందించింది.

ముగిసిన విలువిద్య శిక్షణ

కర్నూలు (రూరల్): స్థానిక ఔట్‌డోర్ స్టేడియంలో విలు విద్య వేసవి శిక్షణ శిబిరం సోమవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈఓ రమణ హాజరై మాట్లాడారు.

రగ్బీ పోటీల్లో రాణించాలి



జాతీయస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైన జట్టు

కర్నూలు(రూరల్) : మహారాష్ట్రలోని పూణెలో ఈనెల 6, 7 తేదీల్లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో రాణించాలని రాష్ట్ర రగ్బీ సంఘం ప్రధాన కార్యదర్శి బి.రామాంజనేయులు కోరారు. సోమవారం స్థానిక బి.క్యాంప్ క్రీడా మైదానంలో రాష్ట్ర జట్టును ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనబరచి పతకంతో తిరిగిరావాలని ఆకాంక్షించారు.

క్రైం కార్నర్

వేధింపుల కేసు నమోదు

కర్నూలు: ఆళ్లగడ్డ ఆర్‌బీకేలో హార్టికల్చర్ కార్యదర్శిగా పనిచేస్తున్న సుధారాముడుపై మూడో పట్టణ పోలీసులు వేధింపుల కేసు నమోదు చేశారు. కర్నూలులోని జ్యుడీషియల్ కోర్టులో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎరుకల సుచరితను సుధారాముడు ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరిద్దరూ కలసి కర్నూలు ధనలక్ష్మి నగర్‌లో నివాసముంటున్నారు. కొంతకాలంగా అదనపు కట్నం కోసం వేధిస్తున్నట్లు సుచరిత ఫిర్యాదు చేయడంతో భర్త సుధారాముడుతో పాటు అతని తల్లిదండ్రులు గిడ్డమ్మ, వీరస్వామి, సోదరులు సుధాకర్, వెంకటేష్‌లపై వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మూడో పట్టణ పోలీసులు తెలిపారు.

49 సంచుల బియ్యం పట్టివేత

కర్నూలు(సెంట్రల్) : నగరంలోని బేకార్‌కట్ట వద్ద రేషన్ బియ్యం పట్టుబడింది. విజిలెన్స్ అధికారులు ముందస్తు సమాచారం మేరకు బేకార్ కట్ట వద్ద ఏపీ21 ఎక్స్ 2711 అనే వాహనాన్ని తనిఖీ చేశారు. అందులో 49 ప్లాస్టిక్ బ్యాగుల పీడీఎస్ రైస్ గుర్తించి పట్టుకున్నారు. కర్నూలుకు చెందిన ఇర్ఫాన్ అనే వ్యక్తి చెప్తే వాహనాన్ని బియ్యం కోసం తీసుకువచ్చినట్లు డ్రైవర్ మాలరాజు అధికారులకు వెల్లడించారు. ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అవీ-ఇవీ

కార్మిక సమస్యల పరిష్కారంలో కేంద్రం విఫలం

కర్నూలు (రూరల్) : కార్మికుల సమస్యల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఐఎన్‌టీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్‌రావు ఆరోపించారు. సోమవారం కళా వెంకట్రావ్ భవనంలో ఆ యూనియన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాల ఐఎన్‌టీయూసీ ఇన్‌చార్జ్ భాస్కర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బతుకన్న, ప్రధాన కార్యదర్శి ఆనందం, కన్నయ్య, మోజెస్, ప్రతాప్, ప్రసాద్, పాల్, దేవరాజు, రాముడు, మద్దిలేటి, మహేష్, జేమ్స్, ఏసేపు పాల్గొన్నారు.

పెంచిన మార్కెట్ విలువను రద్దు చేయాలి

కర్నూలు(సెంట్రల్) : ఇటీవల భూములు, ఇతర ఆస్తులపై పెంచిన మార్కెట్ విలువను రద్దు చేయాలని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.సుధాకరప్ప డిమాండ్ చేశారు. ఈ అంశంపై సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ కార్యాలయ పరిసరాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు జి.ఏసు, లక్ష్మయ్య, అక్బర్‌బాష, రవి తదితరులు పాల్గొన్నారు.

బడి స్థలంలో ఇచ్చిన పట్టా రద్దు చేయాలి

కర్నూలు(సెంట్రల్) : స్థానిక ఇందిరాగాంధీ నగర్‌లో ఉన్న ప్రభుత్వ బడి స్థలంపై కొందరు రెవెన్యూ అధికారులు అక్రమంగా పట్టాలు ఇచ్చారని, వెంటనే వాటిని రద్దు చేయాలని 43వ వార్డు కౌన్సిలర్ కె.మునెమ్మ, మాజీ కార్పొరేటర్ టి.రాముడు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆ స్థలంలో కమ్యూనిటీ హాలు లేదా సచివాలయం నిర్మించాలని డిమాండ్ చేశారు. 43వ వార్డులో ఎంతో మంది పేదలు ఉన్నారని, వారిని కాదని వార్డుకు సంబంధం లేని వారికి పట్టాలు ఇవ్వడం అన్యాయమన్నారు.

ఎస్ఎస్‌పీఓగా షేక్ అహమద్ అలీ

కర్నూలు(రాజ్‌విహార్): కార్మిక సోషల్ సెక్యూరిటీ ప్రమోషన్ ఆఫీసర్ (అసిస్టెంట్ కమిషనర్)గా షేక్ అహ్మద్ అలీ నియమితులయ్యారు. కొంత కాలంగా ఖాళీగా ఉన్న ఈ పోస్టులో విజయవాడ కమిషనరేట్‌లో ఏసీఎల్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనను ఇక్కడికి బదిలీ చేస్తూ కార్మిక శాఖ కమిషనర్ రేఖారాణి ఉత్తర్వులు జారీ చేశారు.

ఆర్‌యూ కాంట్రాక్ట్ అధ్యాపకులకు వేతనం పెంపు

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు జీఓ నం: 110 అమలు చేసినట్లు యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జీఓ అమలుతో వివిధ విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకు వేతనాల పెంపు జరుగుతుందన్నారు.

పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట

- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కాటసాని



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం కల్లూరు అర్బన్ 35వ వార్డులో స్థానిక కార్పొరేటర్ మాధురి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు వీరయ్య, శ్రీనివాసులు యాదవ్, సుధాకర్‌రెడ్డి, సుభాన్, కేశవ్ స్వాగతం పలికారు. తర్వాత ఎమ్మెల్యే కాలనీలో ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలతో వారికి కలిగిన లబ్ధిని వివరించారు. రాష్ట్రంలో జనరంజక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాబోయ్యే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలన్నారు. అలాగే కాలనీలో ఏమైనా సమస్యలు ఉంటే తనకు చెప్పాలన్నారు. డ్రైనేజీలు, కల్వర్టులు, రోడ్లు నిర్మించాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరగా వాటి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుపాల్, ఆనంద్, వలి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పద్యనాటక పోటీలకు 'శ్రీకృష్ణ కర్ణార్జునీయం



శ్రీకృష్ణ కర్ణార్జునీయం నాటకంలోని సన్నివేశం

కర్నూలు కల్చరల్: జాతీయ స్థాయి పద్యనాటక పోటీలకు టీజీవీ కళాక్షేత్రం వారి 'శ్రీకృష్ణ కర్ణార్జునీయం' పద్యనాటకం ఎంపికైంది. ప్రతిష్టాత్మక తిరుపతి అభినయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి 30 సమాజాలు పోటీ పడగా అందులో ఏడు పద్య నాటకాలను ఎంపిక చేశారు. వాటిలో 'శ్రీకృష్ణ కర్ణార్జునీయం' ఒకటని నిర్వాహకులు బీఎస్ రెడ్డి సోమవారం తెలిపారు. జులై నెలలో పరిషత్ నాటక పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. నాటక రచయిత పల్లేటి కులశేఖర్, దర్శకులు, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య కళాకారులకు అభినందనలు తెలిపారు. ఇటీవల మిర్యాలగూడలో ప్రదర్శించిన జాతీయ స్థాయి నాటక పోటీల్లో టీజీవీ కళాక్షేత్రం కళాకారులు ప్రదర్శించిన 'శ్రీకృష్ణ కమలపాలిక' ఏడు బహుమతులు సాధించిందని పేర్కొన్నారు.